కథా నిలయం
2016
శ్రీకాకుళం

# ఆశాకిరణం

సాయంత్రం ఐదు గంటలైంది. ఎండవేడిమి యింకా తగ్గలేదు. వాతావరణం చల్లబడలేదు. ఆం.ప్ర.రోడ్డు రవాణాసంస్థ బస్సు నిండు చూలాల్లా నెమ్మదిగా నడుస్తోంది. కండక్టరుతో సహా బస్సు కెపాసిటీ 52అనిరాసి వుంటే కండక్టరు మహాశయుడు బస్సులో 300మందిని ఎక్కించేడు. అంతకు ముందతను ప్రైవేటు బస్సులో పనిచేయడం వల్ల అడుగు జాగాలో అరడజను మంది పాసింజర్లను సర్ది వేయగల నేర్పుంది. అందరికీ సర్దిచెప్పగల ఓర్పుంది.

డాక్టరు రవీంద్ర మరొకమారు వాచీ చూసుకున్నాడు. అతను బస్సు ఎక్కి రమారమీ రెండుగంటలైంది. ఫ్రంట్ సీటులో కూర్చోవడం వల్ల అటు ఇంజను వేడి ఇటు బయట ఎండవేడితో వుడికి పోతున్నాడు.

“ఇంకా ఎంతసేపు యీనరకయాతన అనుభవించాలో!” అని అనుకున్నాడు యింతలో-

“రామోరం!........ రాంవొరంల దిగేవోల్లు బేగి రావోల!” అంటూ కేకవేసేడు కండక్టరు.

రవీంద్ర లేచి బ్రీఫ్‌కేసు చేత్తో పట్టుకొని పద్మవ్యూహాన్ని చీల్చుకొని బయటకు వచ్చి కిటికీ లోంచి తన సామాన్లు అందుకున్నాడు. రెండుసూటుకేసులు, మూడు ఎయిర్‌బేగ్స్, ఒకబ్రీఫ్‌కేసు మొత్తం ఆరు శాల్తీలు లెక్కచూసుకునే లోపలే బస్సు దుమ్ములేపుకుంటూ వెళ్ళిపోయింది. సామాన్లు రోడ్డుప్రక్క మర్రిచెట్టుక్రింద వుంచేడు.

అంతవరకూ చెమటతో తడిసవున్న శరీరానికి చిన్న గాలిరివట తగలగానే శరీరమంతా జలదరించి నట్లు ఫీలయ్యేడు రవీంద్ర.

యీరోజు సాయంత్రం బస్సులో వస్తున్నట్లు ముందుగానే కంపౌండరుకి ఉత్తరం

రాసేడు. "తనకి వూరు క్రొత్త కనుక మనిషిని బస్సుస్టాపు వద్దకు పంపమని, కాని వచ్చినట్లు లేదే?" అనుకున్నాడు.

రోడ్డుకిరువైపులా పచ్చని పంటపొలాలున్నాయి. పొలాల నడుమ నుండీ కుడివైపోక మట్టిరోడ్డు, ఎడమవైపోక మట్టిరోడ్డూ వొంపులు తిరిగి వున్నాయి. వాటిలో రాంవరం వెళ్లే రోడ్డు ఏదో తెలియలేదు. కను చూపుమేర ఎక్కడా జనసంచారం లేదు.

అతను నిల్చున్న ప్రదేశానికి 50 అడుగుల దూరంలో ఓచిన్న పాక కనిపించింది. పాకలో ఎవరైనా వుంటే వారిని అడిగి తెలుసుకోవచ్చని పాక వైపు నడిచేడు. పాకలో ఒకవ్యక్తి గొంతుకూర్చొని మోకాళ్ళ మీద రెండు చేతులు ముణుకులూ వుంచి అరచేతులతో తలను పట్టుకొన్నాడు. అంతకు ముందే శ్మశానంలో తల్లిని తగలబెట్టి వచ్చిన వాడిలా వుంది అతడి వాలకం.

చూడ్డానికి అతను మానవ అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లున్నాడు. శరీరంలో ఎక్కడా రక్తమాంసాలు న్నట్లు లేదు. పిల్లలకు అతనిని చూపించి మానవ శరీరంలో ఎముకల నిర్మాణం గురించి పాఠం చెప్పొచ్చు. అతను తీవ్రమైన ఉబ్బస వ్యాధితో బాధపడుతున్నాడు. నోటితో గాలిని పీల్చి వదులుతున్నాడు. పరిగెత్తి అలసిపోయిన వూరకుక్క జాపోస్తున్నట్లుంది అతని పరిస్థితి.

అతని ప్రక్కనే మకిలి పట్టిన సిల్వరు పళ్ళేముంది. దానిలో ఏవేవో తినుబండారాలున్నాయి. వాటి మీద దట్టంగా ముసిరిన యీగలు చూసేవారికి పళ్ళెం నిండా యీగలు పోసి వుంచినట్లుంది. యింకొక చిన్న పళ్ళెంలో చుట్టలు, బీడీలు అగ్గిపెట్టెలున్నాయి. పాకలో ఒకమూల ఆరిపోయిన పొయ్యి, ఒక కెటిల్ ప్రక్కనున్న మట్టి అరుగు మీద బోర్లించి వుంచిన రెండు సిల్వరు గిన్నెలు, అరడజను గాజుగ్లాసులు వున్నాయి.

అతను మాట్లాడే పరిస్థితిలో లేడని గ్రహించేడు. కర్తవ్యం గుర్తుకొచ్చి అతనిచేతి పల్స్ చూసేడు. బ్రీఫ్‌కేసు తెరచి స్టెతస్కోపు తీసి దానితో పరీక్షించాడు. వెంటనే డిస్పోజబుల్ సిరంజిలోకి మందునింపి అతనికి ఇంజక్షన్ చేసేడు. తన పరికరాలు బ్రీఫ్‌కేసులో సర్దుకుంటున్నాడు. అంతవరకూ గుడ్లప్పగించి రవీంద్రవేపు చూస్తున్న ఆముసలివాడు దబ్బున రవీంద్ర కాళ్లమీద పడేసరికి తృళ్లిపడ్డాడు.

'సొరగం నుండి దిగొచ్చిన దేవుడే బావూ తవరు! నాను సెప్పకుండానే సూసి తవరు నారోగం సిటంల దీసి పారేసినారు!" అన్నాడు కృతజ్ఞతతో.

"అదేంకాదు నేను రాంవరం హాస్పటల్లో డాక్టరుగా వచ్చేను. నాకోసం మనిషి ఎవరూ

వచ్చినట్లు లేదు. వూరెటు వుందో తెలియదు. సామాన్లు వున్నాయి." అన్నాడు.

"మరి యీడదిగీసి నారేటండీ! కోసెడు దూరం నాటుదారిన తవలాటి వోరికి కట్టవేసే! అటు దుక్కుదిగితే రిక్సాదొరుకుద్ది"

అతని మాటలకు రవీంద్ర కొద్దిగా కంగారుపడి-

"నాకు తెలియదు కండక్టరు యిదే రాంవరమని చెప్పిదించేసేడు."

"దొల్త రాంవోరానికి యోడనే డిగేవోరండీ ! పోయిన వోట్ల ఎలచ్చన్లకి అటు దుక్కునుండి రోడ్డేసి నారండీ. రిక్సాలు, బల్లు వూర్లోకి ఎల్తాయండి మరేటీ గాదండీ నాకు సుకంనేక మూడు దినాలై దుకానం ఎట్టనేదండీ. నేకుంటే పొద్దోయి మనూరి మడుసులు యీడనే వుండేవోరండీ"

"సామాన్లతో మరి వూర్లోకి వెళ్లడమెలా? ఎవరైనా మనిషి వుంటే బాగుండును"అన్నాడు. చుట్టూ ఓమారు పరికించి.

ముసలతను కూడా నుదుట కనుబొమ్మల వద్దచేయివుంచుకొని చూసి "ఓహో!" అని బిగ్గరగా కేక వేసేడు. దూరంగా పొలాల మధ్యనుంచి ఒక అమ్మాయి వచ్చింది. సుమారు 20ఏళ్ల వయస్సుంటుంది. లంగా వోణీ వేసుకొంది. అమ్మాయి అందంగా నాజూగ్గా వుంది. నుదుట స్వేద బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

"నువ్వా! తల్లీ మల్లెమ్మా! ఎవురో అనుకుని కేకెట్నాను. యీబావును సూసినావూ! మనూర్ల డాట్టరు గొచ్చినారు! దేవుడే అనుకో వూర్లకాలెట్టనేదు నాకు వైద్దెం సేసినారు. మూడు దినాల ఎగూపిర్సు దుకానం ఎట్టనేదు. బస్సుదిగి నన్ను సూసి సూదిమందేసి సిటంల రోగం నాగేసినారు. సామాన్లత పొరపాట్న యీడ బస్సు దిగేసినారు. ఎవురూ అవుపడతలేదు" అన్నాడు.

ఆ అమ్మాయి రవీంద్ర వేపు అనుమానంగా చూసింది.

"నాను అబద్ధం సెవతన్నా నేటి యిదిసూడు!" అంటూ రవీంద్ర పారవేసిన డిస్పోజబుల్ సిరంజి తెచ్చి చూపించేడు. అంతేకాదు చేతి మీద యింజక్షను చేసిన చోటు కూడా చూపించేడు. ఆ అమ్మాయి అప్రయత్నంగా చేతులు జోడించి రవీంద్రకు నమస్కరించింది. సామాన్ల దగ్గరకు వెళ్ళి వాటిని ఎత్తి బరువు చూసింది. పైటకొసను చుట్టలా చుట్టి తలపై పెట్టుకొని ఒక పెట్టెను దానిమీద వుంచి రెండో పెట్టెను దాని మీద వుంచమంది. రవీంద్ర అట్లానే చేసేడు. ఎయిర్‌బేగ్స్ చెరొక భుజానికీ తగల్చుకొని "బయలెల్లండి!" అంది.

రవీంద్ర ఒక ఎయిర్‌బేగ్ భుజానికి తగల్చుకొని బ్రీఫ్‌కేస్ చేత్తో పట్టుకొన్నాడు. అంతవరకూ

గుడ్లప్పగించి చూస్తున్న ముసలివాడు తేరుకొని-

"ఏటి! తల్లీ సామాన్లు నువ్వొట్టు కెల్తావా వూర్లోకి! బాగోదు. నాను రానేటి?" అన్నాడు దిగులుగా.

"పర్నేదు తాతా. పొద్దుగూకుతంది!" అంటూ రోడ్డుకు కుడిప్రక్క నున్న నాటు దారిన బయల్దేరింది. రవీంద్ర ఆమె వెనుక నడుస్తున్నాడు. నాటు త్రోవన నడక అలవాటు లేక చాల అవస్త పడుతున్నాడు.

"డాట్టరు బాబూ! తవరు వొంటరిగొత్తున్నారు! కుటుంబం తేనేటండీ? ఈడ భోజనానికి యిబ్బంది పడాల" అంది మల్లి

"భోజనహొటల్స్ లేవాండీ?" అన్నాడు

"హొటేలు కాడ తిండి తవలాటోరికి నాబంనేదండి. నేబరుకాసు హొటేల్లండి. వూరికి ఆటు దుక్కు జంక్సను కాడున్నాయండి. వూర్ల టీ దుకానాలున్నాయండి. అయి కూడ బాగో...డి. అంచాత తవరు ఎంటనే అమ్మగోర్ని దోలుకు రావోలండి. ఆసుపత్రికాడే తవకు సక్కటి బంగలా వుందండి" అంది.

"నిజమే! కాని నాకు అమ్మానాన్నా లేరు. యింకా పెళ్ళి కాలేదు."

"అట్టాగయితె కట్టవేగదండి. తవరు కూడ యీడ కుదురుగ్గా వుండరండ్"

"ఏం? ఎందుకని?"

"కారనవేటో తెల్దండి. యింతవరకూ ఏడాట్టరు బావూ పేమిలీ తోలుకు రానేదండి. వోరం దిరక్కుండానే ఎల్లిపోనారండి"

దారికి అడ్డుగా పన్నెండడుగుల వెడల్పున్న పంటకాలువ నిండుగా దరులొరసు కుంటూ ప్రవహిస్తోంది. దాని మీద ఒక తాటి మ్రాను అడ్డంగా రెండు గట్లనూ కలుపుతూ వేసివుంది. మల్లి దానిమీద నుండి చకచకా నడుచుకొని అవతలి వైపు వెళ్లింది. రవీంద్ర దానిమీద కాలు వేసేసరికి అది కొద్దిగా కదలినట్లయింది. బేలన్స్‌గా దానిమీద నడిచి రాలేడని గ్రహించి వెనుతిరిగి యివతలి వేపు వచ్చింది.

"బాబుగారూ! ఎదర వొంతెన వుంది రండి" అని కాలువ గట్టున నడిచింది.

రవీంద్ర తన అసమర్ధతకు సిగ్గుపడి ఆమె వెంటనడిచేడు. ఫర్లాంగు దూరంలో వున్న వంతెన దాటి అటుప్రక్కకు వెళ్లి అంత దూరం వెనుకకు వచ్చి నాటు త్రోవన మరొక వంద అడుగులు వెళ్లేసరికి "ఎవురదీ!" అంటూ పొలం గట్టు మీదినుంచి ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి

"నువ్వా తల్లీ! ఎవురీ బాబు? సామాన్లు నువ్వొట్టుకుత్తున్నావేటి?" అని భుజం మీద వున్న

తువ్వాలు తలకుచుట్టుకొని "యిటుదే" అని మల్లి వద్దనున్న సామాన్లు అందుకోబోయేడు. అతనికి సుమారు 50 సంవత్సరాల వయస్సుంటుంది. పంచమోకాళ్ల వరకూ ఎగ్గట్టుకున్నాడు. కిర్రు చెప్పులు తొడుక్కున్నాడు. కురచ చేతుల కంటిమెడలాల్చీ వేసుకున్నాడు. చేతిలో చేపాటీకర్ర. మనిషి దృఢంగా వున్నాడు.

"బాబాయి యీరు మనూరి కొత్తడాట్టరుగోరు. తెలవక ముసలయ్య టీదుకానం కాడ దిగేసినారు. యీపొద్దు మనూరి మడుసులు అటు దుక్కురానేదుట. తాత ఉబ్బసం ఎగూపిరి మూడు దినాలై దుకానం ఎట్టనేదు అంచాత ఎవురూ నేరు. పొద్దుగూకుతుందని నేనొట్టుగున్నా. ఆబాబు కాడసామానందుకో" అంది.

"దండాలు డాట్టరు బాబూ" అంటూ అతని చేతిలోని బ్రీఫ్‌కేసు భుజానికున్న బేగ్ అందుకున్నాడు.

"డాట్టరు బాబూ యీయన మా పిన్నమ్మ పెనిమిటి సెలమయ్య వూర్లపెద్దమోతుబరి. యీ అవుపడే పొలాలన్నీ యీరివే." అంది మల్లి.

రవీంద్ర ఆయనకు నమస్కరించేడు. వారు మరో పదడుగులు వేసేసరికి యిద్దరు వ్యక్తులు పొలాల గట్ల మీంచి పరుగెత్తుకుంటూ వచ్చి ఒకరు మల్లి వద్దనున్న సామాన్లు ఇంకొకరు చెలమయ్య వద్దనున్న సామాన్లు అందుకున్నారు.

"మనూరి కొత్త డాట్టరు బాబురా" అన్నారు.

"దండాలండయ్యా" అన్నారు యిరువురూ ఒకేమారు.

పచ్చనిచేలమీద నుండీ చల్లని పిల్లగాలులు వీచుతున్నాయి.

"ఏటో బావూ సుట్టుపక్కల గేమాల కిది సెంటరని ఆసుపత్తిరి ఎట్టి నారు గాని డాట్టరు బాబులు ఎవ్వరూ కుదురుగ్గా నేరండీ. తవరి పేమిలీ......" అనబోయి మల్లిచేసిన సంజ్ఞ వల్ల వూరుకున్నాడు. చలమయ్య.

వారు వూరి దగ్గరకి వచ్చేరు. అక్కడ డజను మంది పిల్లలు యిసుకలో చెడుగుడు ఆడుకుంటున్నారు.

"అనుమంతూ! అంటూ కేక వేసింది మల్లి. ఆమె పిలుపు విని 12 ఏళ్ళ కుర్రవాడు పరిగెత్తుకుంటూ ఆమె వద్దకు వచ్చి "ఏటి అక్కా!" అన్నాడు.

"నువ్వు లగెత్తుక కాంపౌండర్ సూర్రావింటి కెల్లి డాట్టరు గోరు వొచ్చేసినారు బంగలా తాలాలొట్టుకు రమ్మను.ఆబావు ఇంటికాడ నేకుంటే యింట్లో తాలాలు అడిగి ఆసుపత్తిరికాడ బంగలాకు రా....." మల్లి మాట పూర్తికాకుండానే వాడు పరుగు లంకించుకున్నాడు.

"మల్లెమ్మ తల్లీ నాను యింటికెల్లి పాలు పితికించి ఎచ్చబెట్టి అంపుతా. నువ్వటే ఎల్తన్నావు గాబట్టి డాట్టరు బాబు కేటిగావోలో మనోళ్లను సూడమను" అని మల్లితో చెప్పి "డాట్టరు బావూ నాను శలవ దీసుగుంటాను" అని నమస్కరించి ప్రక్కకు తప్పుకొని వెళ్లిపోయేడు చలమయ్య.

మరోపది నిముషాల్లో వూరికి పడమర వేపునున్న డాక్టర్ క్వార్టర్స్‌కు చేరుకున్నారు.

మల్లెక్కా సూర్రావింటికాడ నేరంట యియిగో తాలాలు యిచ్చేరు అంటూ అందించేడు హనుమంతు.

"హాస్పటల్ ప్రక్కనే చుట్టూరా కాంపౌండు మధ్య టూబెడ్‌రూమ్స్ క్వార్టరది. ఎటాచ్‌డు బాత్, సీలింగ్ ఫేన్స్. ఫర్నీచర్, బెడ్స్ యిల్లు సదుపాయంగానే వుంది. ఫినాయిల్ వేసి యిల్లు కడిగించినట్లుంది. యింకా ఫినాయిల్ వాసనుంది.

పెట్టెలు. బేగ్స్ కప్ బోర్డులో పెట్టించింది మల్లి.

"ఏవండీ! వారికెంతివ్వాలండీ? " అన్నాడు రవీంద్ర పర్స్‌తీసి చేత్తో పట్టుకొని.

"ఏటి కూలిత్తారా? నానూ కొంతదూరం వొట్టిగొచ్చినాను. నాకూ కూలిత్తారా?...... ఏటీ వొద్దు అల్లు మాపనోల్లు" తవరు తానం సెయ్యండి.

"ఎంకన్నా నువ్వీడుండి బాబుగారికేటి కావాలో సూడు. కావన్నానువ్వు మీకామందుగారింటికెల్లి పనిసూసుకో నాను యింటికెల్తన్నాను" అని పనులు పురమాయించి వెళ్లిపోయింది మల్లి.

రవీంద్ర స్నానం చేసి పైజమా, లాల్చీ వేసుకున్నాడు. యిప్పుడు ఎంతో హాయిగా వుందతనికి.కామయ్య స్టీలు కేరేజీతో వేడిపాలు, నాలుగు స్టీలుగ్లాసులు తెచ్చేడు. పాలు లీటరు పైనే వున్నాయి. బేగ్‌లోంచి నెస్‌కేఫ్ టిన్నూ, పంచదార డబ్బా, స్పూన్ తీసి కాఫీ కలిపి వారిరువురికీ యిచ్చి తను కూడా తీసుకున్నాడు.

వారు కాఫీత్రాగి బావుందని మెచ్చుకున్నారు. కామయ్య వెళ్లిపోయేడు.

గేటుముందు సుమారు పాతికమంది జనం మూగేరు.

"ఎవరు వాళ్లు!"అని బయటకు వచ్చి చూసేడు రవీంద్ర. వెంకన్న గేటు దగ్గరకు వెళ్ళి "ఎల్లిపొండి బాగోదు" అని వారిని పంపించి వచ్చేడు. "పూర్లజనాలు తవర్ని సూడ్డానికి" అన్నాడు.

"పనివుంటే వెళ్లి చూసుకోండి యిక్కడ నాకేం అవసరం లేదు" అన్నాడు వెంకన్నతో.

వెంకన్న వెళ్లిపోయాడు.

"డాట్టరు బాబూ! అంటూ మల్లి, చలమయ్య చాల ఆందోళనతో వచ్చేరు. వారి వెనుక మరొక స్త్రీ బిడ్డను భుజాన్న వేసుకొని వరండా దిగువనిల్చుంది.

"మామనువాడికి జొరం శానాఎక్కువ గుందండి తవరు...."

"పదండి వచ్చి చూస్తాను"

"యీడనే దీసుకొచ్చి నావండి"

"యిలా తీసుకురండ"ని పిల్లవాడిని చెక్‌చేసి యింజక్షన్ యిచ్చేడు.

"యిది వైరస్ ఫీవర్ పర్వాలేదు పదినిమిషాల్లో తగ్గిపోతుంది అలా మంచం మీద పడుక్కో బెట్టండి" అన్నాడు.

"మా పెద్దమ్మాయి పార్వతండి. పెనిమిటికి అయిదరాబాద్‌లో ఉజ్జోగవండి నాను గొడ్లసాయిడి కాడ పాలు దీయించికొని ఎల్లేసరికి యీడికి జొరం దగిలింది. తవకి పాలు దోలేసి సూసేను. వొల్లు కాలిపోతుందని తీసుగొచ్చాను."

రవీంద్ర వాళ్ళను కూర్చోమని కాఫీ కలిపి యిచ్చేడు.

"మాకెందుకండీ!" అంటూ మొహమాట పడ్డారు.

"అన్ని పాలు పంపించేరు నేనేం చేసుకోను"

"ఎన్నో ఏటండీ? రెండుగుక్కలు"అన్నారు.

కుర్రాడికి జ్వరం తగ్గి చెమటలు పట్టేయి. రవీంద్ర మరొక మారు పరీక్షించి రెండు మాత్రలు యిచ్చి రాత్రి, ఉదయం వేయమని చెప్పేడు. వారు డాక్టర్ గారికి కృతజ్ఞతలు చెప్పేరు. "తల్లీ డాట్టరు బాబు భోజనం ...." అన్నాడు చలమయ్య.

"నాను సూసుగుంతాను బాబాయి" అంది మల్లి.

వాళ్లు వెళ్లిపోయిన తరువాత రవీంద్ర మెడికల్ మేగజైన్ తిరగేస్తూ కూర్చున్నాడు. మరో రెండు గంటల తరువాత-

"నమస్కారం" అన్నమాటలకు ఉల్కిపడి చూసేడు. ఎదురుగా సుమారు 45ఏళ్లు పైబడ్డ ఒకావిడ, మల్లి నిల్చున్నారు. వారిచేతిలో స్టీలు కేరియర్ ప్లాస్టిక్ సజ్జాలో సీసాలు, ప్లేట్లు, స్టీలు కంచం వున్నాయి. మల్లితో వచ్చిన స్త్రీ రూపురేఖలు, కట్టు, సభ్యత సంస్కారం గల వ్యక్తిలా కన్పిస్తున్నాయి.

"డాట్టరు బాబూ యీరు శారదా టీసరుగోరు. తవకి బోజనం వొట్టుగొచ్చినాం" అంది

మల్లి. వారు తెచ్చిన సామాన్లు టేబుల్ పైన వుంచేరు.

"నమస్కారం అమ్మా! కూర్చోండి మీరెందుకు శ్రమ తీసుకున్నారు. ఎవరిద్వారానైనా పంపించవల్సింది". అన్నాడు.

"యిందులో శ్రమేం వుంది బాబూ! యిల్లు దగ్గరే. ఓమారు చూసినట్లుంటుంది కదా! మీ నేటివ్‌ప్లేస్ ఏది? మీ ఫాదర్ ఏం చేస్తుండేవారు? అన్నారు రవీంద్రను ఆశ్చర్యంగా చూస్తూ

వైజాగ్‌లో చదువు పూర్తయిందండి. మాఫాదర్ మదర్ నాచిన్నతనంలో పోయేరుట. మాఅంకుల్ నన్ను ఆదుకొని చదువు చెప్పించేరు. వారిప్పుడు వైజాగ్‌లో డి.ఎమ్.ఓగా వుంటున్నారు.

"సారీ! పాతవిషయాలు గుర్తుచేసి మనసు నొప్పించేను"

"లేదండీ! నాకు మాఅమ్మ నాన్న ఎలా వుంటారో తెలియదు....."

"బాధపడకు బాబూ! నన్ను అమ్మా! అని పిలిచేవు కదా! అలానే యిక ముందు కూడా పిలువు" అన్నారు. "భోజనం చేస్తావా? వడ్డించనా! అన్నారు.

రవీంద్ర చేతులు వాష్ చేసుకొని వచ్చేడు. ఆలుగడ్డల వేపుడు, సాంబారు, కొబ్బరిపచ్చడి, అప్పడాలు, చిక్కటిపెరుగు, వూరగాయ కొసరి కొసరి వడ్డించేరు శారదగారు. ఆవిడ ఆప్యాయతకు రవీంద్ర కన్నులు చెమ్మగిల్లాయి.

"ఏం బాబూ కారం ఎక్కువైందా? రుచిగాలేదా? అన్నారు ఆతృతతో .

"అదేం కాదండి, నాకు జ్ఞానం వచ్చినప్పటి నుండీ బోర్డింగ్ స్కూలు, తరువాత కాలేజీ హాస్టల్ భోజనం. నాజీవితంలో భోజనం రుచంటే ఏమిటో యీనాడు తెల్సింది" అన్నాడు. మెచ్చుకోలుగా.

"నేనేం చేసి పెట్టేను? మల్లి చెప్పిన తరువాత గబగబా ఏవో చేసేను అయినా నువ్వు తిన్నదెంత? పిడికెడు. పిట్టమేతంత" అన్నారు నవ్వుతూ.

"ఉదయం టిఫిన్ పంపుతాను. భోజనం పదిగంటలకు చేస్తావా? లేక 12గంటలకా. నేను 12గంటలకు స్కూలునుండి వచ్చేస్తాను.

"పన్నెండుకే చేస్తాను తొందరలేదు."

యింతలో ఓ14ఏళ్ల కుర్రాడు వచ్చేడు. ముగ్గురికీ నమస్కరించి మా కామందుగోరు నాకు డాక్టరుబాబు యింటికాడ డూటీ యేసేరు. "అన్నాడు సంతోషంగా

"చలమయ్యగారి పనివాడు శివయ్య. మంచి చురుకైన వాడు. మాస్కూల్లో 8వక్లాసు

వరకూ చదివేడు".అన్నారు శారదగారు.

శివయ్య వస్తూనే రవీంద్ర భోజనం చేసిన కంచం కడిగి టేబుల్ క్లీన్ చేసేడు. బెడ్ దులిపి రవీంద్ర ఇచ్చిన బెడ్‌షీట్ పరిచి పిల్లోకవరు మార్చేడు.

"నువ్వు భోజనం చేసేవా శివయ్యా?" అని అడిగేరు శారదగారు.

"సేసేను. నన్ను తొందరగా తిండితిని డాట్టరుబాబింటికి బేగివెల్లమని భోజనవెట్టి పోలిసినారు".

"నీకు చాప దుప్పటి యిస్తానురా" అని వాడిని తమ కూడా తీసుకెళ్లి వాటిని యిచ్చి పంపేరు శారదగారు.

రాత్రి పదిగంటలప్పుడు సూర్యారావు వచ్చి జంక్షను వద్ద యిప్పటి వరకూ చూసివచ్చినట్లు చెప్పేడు. రిసీవ్ చేసుకోలేక పోయినందుకు విచారించి, భోజనం ఏర్పాట్లు గురించి తెలుసకొని వెళ్లిపోయేడు.

సూర్యారావుకి నలభై సంవత్సరాల వయస్సుంటుంది. బట్టతల మనిషి దృఢంగా వున్నాడు. అతని మాట నడక ఎంతో నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నాయి.

"నా గురించి చాలాశ్రమ తీసుకున్నారు" అన్నాడు రవీంద్ర.

"డాట్టరు బాబూ! ఆరి మాటలు నమ్మేసినారేటి? ఆరింత వొరకూ పొరుగూర్ల సీట్లాట ఆడొత్తున్నారండి. ఆరు దినవూ సీట్లాటేనండి" అన్నాడు శివుడు. సూర్యారావు వెళ్లిన వేపు చూస్తూ.

రవీంద్ర విషయం విన్నప్పటి నుంచి శారదగారి మనసు వికలమైంది. "కొందరి జీవితాలతో విధి ఎందుకిలా ఆటలాడుకుంటాడో?" అనుకున్నారు. ఆమె మదిలో గత స్మృతులు మెదిలాయి- రాత్రి చాలా పొద్దు పోయేవరకూ నిద్రరాలేదు శారదగారికి.

వాసుదేవరావుగారి ఏకైక కుమార్తె శ్యామల. వాసుదేవరావుగారు డిప్యూటీ కలక్టరుగా పనిచేసి రిటైర్ అయ్యారు. వారుండే వీధిలో ముకుందరావనే ఎలిమెంటరీ స్కూలు టీచరుండేవాడు. శారద అతని కూతురు అందాలరాసి.చదువుల సరస్వతి. చాల చురుకైనపిల్ల. శ్యామల శారద మంచి ఫ్రెండ్స్. ఒకర్ని విడిచి ఒకరు క్షణమైనా వుండేవారు కాదు. వారి మధ్య అంతస్తులు ఏనాడూ అడ్డురాలేదు. వాసుదేవరావుగారు శారద తెలివితేటల్ని, చురుకుతనాన్ని ఎప్పుడూ మెచ్చుకునేవారు. శారదను కూడా తన కూతురు వలే చూసుకొనేవారు. శారద, శ్యామల యిద్దరూ బి.ఏ పాసయ్యారు. శారద బి.యి.డి.అయి టీచరుగా ఉద్యోగం చేస్తోంది.

వాసుదేవరావుగారి మేనల్లుడు రాజేంద్ర ఎమ్.ఎస్ చేసి హైదరాబాద్‌లో అసిస్టెంట్

సర్జన్‌గా జాబ్ చేస్తున్నాడు. శ్యామల వివాహం రాజేంద్రతో ఘనంగా చేసేరు వాసుదేవరావుగారు. స్నేహితురాలి పెళ్లిలో ఎంతో సహాయం చేసింది శారద. రాజేంద్ర ఫ్రెండ్ డాక్టరు మాధవరావు శారద అందచందాలకు, చురుకుతనానికి ముగ్ధుడై ఆమె వివరాలు తెలుసుకొని ఆమెకు తన అభిప్రాయం తెలియజేసేడు. శారద సంకోచిస్తుంటే ఆమెకు శ్యామల, రాజేంద్ర నచ్చచెప్పి పెళ్లికి ఒప్పించేరు.

మాధవరావుకి మేనరికం వుంది. అందువల్ల గొడవలు రావచ్చని శారదను రిజిస్టర్ మేరేజ్ చేసుకొని తనతో గుంటూరు తీసుకెళ్లేడు. అతను ప్రస్తుతం గుంటూరు గవర్నమెంటు హాస్పటల్లో జాబ్ చేస్తున్నాడు.

ఒకరోజు రాత్రి కిచెన్‌లో పనిచేసుకొంటూంటే వీధి వరండాలో మాధవరావు నిల్చుని ఎవరితోనో వాదిస్తున్నాడు. విషయం తెలుసుకుందామని డ్రాయింగ్‌రూమ్ కిటికీలోంచి తొంగి చూసింది శారద. యిద్దరు వ్యక్తులు చూడ్డానికి పల్లెటూరి వాళ్లలా వున్నారు. ముఖాలు కన్పించలేదు.

"యింట్లోకిరా మావయ్యా! లోన కూర్చుని మాట్లాడుకుందాం"

"ఏమొకం పెట్టుకొని నీయింట్లో కాలెట్టాల! నాబొట్టినన్నేయం సేసినోడివి ఎట్టా బతకతవో సూత్తాను. అది పుట్టినకాడనుంచీ నీ పెళ్లావేఅంది మీ అమ్మ. మాఅప్ప మాట నిజవేనని నమ్మినోడిని దగాసేసేవు నానోగ్గను" అని విసురుగా వెళ్లి పోయేడు.

మాధవరావు సిగ్గుతో లోనికి వచ్చి ఎదురుగా భార్యను చూసి తల వంచుకొని బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయేడు. శారద ఆవిషయం ప్రస్తావించలేదు.

ఏడాది గడిచింది. శారదకు పండంటి కొడుకు పుట్టేడు.

నామకరణ ఫంక్షన్‌కి శ్యామల, రాజేంద్ర వచ్చేరు. కుర్రాడికి ఆదిత్య అనిపేరు పెట్టేరు. శారద బలవంతం వల్ల శ్యామల మరో నాలుగు రోజులుంది. ఆనాలుగు రోజులూ స్నేహితురాళ్లిద్దరూ ఎంతో ఆనందంగా గడిపేరు. శ్యామల ఈనాలుగు రోజులూ ఆదిత్యకు సంరక్షణ చేసి ఆనందించింది. "శారదా! ఆదిత్యను నాకిచ్చీవే పెంచుకుంటాను" అంది "తీసుకెళ్లవే నీసరదా తీరుస్తాడు" అంది శారద నవ్వుతూ. స్నేహితురాళ్ళిద్దరూ తరుచు ఉత్తరాల ద్వారా ఒకరి క్షేమసమాచారాలు ఒకరు తెలుసుకుంటున్నారు.

శారద ప్రోద్బలం వల్ల మాధవరావు తనకు కొడుకు పుట్టిన విషయం తల్లికి తెలియజేసేడు. ఆమె వద్దనుండి జవాబు రాలేదు.

"నీకు తెలియదు శారదా! అమ్మ చాలా పట్టుదలగల మనిషి. దానికి తోడు పల్లెటూరి

చాదస్తం" అన్నాడు. ఆమెను బుజ్జగిస్తూ.

"పోనీ ఆదిత్యను తీసుకొని మనమే వెళ్లి ఆవిడ ఆశీర్వాదం పొందుదాపండీ. వీడికి ఏడాది నిండుతోంది." అంది.

"మాధవరావు అందుకు సమ్మతించి తాము వస్తున్నట్లు తల్లికి ఉత్తరం రాసేడు. అయితే వారి ప్రయాణానికి ముందురోజు మాధవరావు స్కూటర్ ఏక్సిడెంట్ వల్ల మరణించేడు. రాత్రి డ్యూటీ చేసుకొని యింటికి తిరిగి వస్తుండగా వెనుకనుండి వస్తున్న లారీ డాష్ యివ్వడం వల్ల ప్రమాదం జరిగింది.

శారదకు ప్రపంచమే అంధకారమైనట్లయింది అత్తగారికి యీవిషయం తెలియజేయడానికి ఆవిడ ఎడ్రస్సు తెలియదు. అంతకు ముందురోజే శ్యామల, రాజేంద్ర బెంగుళూరు మెడికల్ కాన్ఫరెన్స్‌కి వెళ్లేరని వింది. యీ కష్టసమయంలో ఆమెకు నాలుగు ఓదార్పు మాటలు చెప్పేవారు కరువయ్యేరు.

ఇన్సురెన్సు కంపెనీ వాళ్ళు 50వేల రూపాయల డి.డి. అందజేసేరు.

ఒకవేళ యీ ఏక్సిడెంటులో తన భర్త మేనమామ హేండ్ ఉందేమోననే ఆలోచన వచ్చి ఎంతో భయపడింది. దానికి తోడు ఒకరోజు ప్రక్కింటావిడ "మీరు బజారుకు ఎళ్లినప్పుడు యిద్దరు పల్లెటూరి వ్యక్తులు వచ్చి డాక్టరు గారి గురించి మీగురించి వాకబు చేసి వెళ్లేరని" చెప్పింది. అవార్త విన్న శారద భయంతో కంపించి పోయింది. యిక తనకు ఆదిత్యకు భద్రత ఎలాగని విచారించింది.

మర్నాడే బేంకులో వున్న డబ్బు డ్రా,చేసి తెచ్చింది. కొద్దిగా బట్టలు బేగ్‌లో వేసుకొని ఆటోలో బస్ స్టాండుకు బయల్దేరింది ఆదిత్యను తీసుకొని. హైదరాబాద్‌కి టిక్కెట్ తీసుకొని బస్సెక్కింది. ఆమె హైదరాబాద్ చేరుకొనే సరికి రాత్రి 11గంటలైంది. వర్షం జోరుగా కురుస్తోంది. ఆటోలో రాజేంద్ర యిల్లు చేరుకొని కాలింగ్ బెల్ నొక్కింది.

"యింత వర్షంలో రాత్రి పూట ఎవరొచ్చారా!"అని ఆశ్చర్యపోతూ తలుపు తెరిచిన శ్యామల ఎదురుగా నిల్చున్న శారదను, ఆమె భుజం మీద నిద్రపోతున్న ఆదిత్యను చూసి నిర్ఘాంతపోయింది. వారు ఆరోజు సాయంత్రమే బెంగుళూరు నుంచి వచ్చేరు.

"ఏమిటే! యింత రాత్రప్పుడు వర్షంలో యిలా వచ్చేవేంటీ?" అని ఆదిత్యను అందుకుంది. శారదకు జవాబు చెప్పేందుకు నోటమాట రాలేదు. కుప్పలా కూలబడిపోయింది.

"ఏమైందే నీకు!" అనగానే రాజేంద్ర వచ్చి ఆమె పల్సు చూడబోయేడు. తనకేమీ కాలేదని అతడిని వారించింది. దుఃఖాన్ని ఆపుకుంటూ జరిగిందంతా వారికి చెప్పింది.

"మైగాడ్! మేము పదిరోజులు వూర్లో లేకపోవడం వల్ల యీవిషయం మాకు తెలియలేదని' అమెను ఎన్నో విధాలుగా వోదార్చేరు.

"శ్యామలా నువ్వు యిదివరకు ఆదిత్యను నీకిస్తే పెంచుకుంటానన్నావు గుర్తుందా? ఇప్పుడు ఆదిత్యను నీ చేతుల్లో పెడుతున్నాను తీసుకో" అంది.

"ఏమిటే ఆ మాటలు! నీకు మతిపోలేదు కదా!" అంది కోపంతో.

"లేదు నేను సీరియస్‌గానే చెప్తున్నాను. నీకు ఇష్టం లేకుంటే చెప్పు యిప్పుడే వీడిని ఏ అనాథ ఆశ్రమంలోనైనా అప్పగిస్తాను. వీడు నా వద్ద వుంటే వీడి లైఫ్‌కి సెక్యూరిటీ లేదు" అంది భయంతో.

"నువ్వు భయపడ్డంలో అర్థముందమ్మా! ఇప్పుడు ఆదిత్య కోట్ల ఆస్తికి వారసుడు. మనం అప్రమత్తంగా వుండడం మంచిది. పోనీ నువ్వు కూడ ఇక్కడే వుండమ్మా!"

"ఒద్దన్నయ్యా! నేను ఉండడం మంచిది కాదు. ఇన్సురెన్స్ సొమ్ము 50 వేలు ఇవిగో వాడి కొరకు వినియోగించండి" అంటూ డబ్బువున్న కవరు వారికిచ్చి వారెంత బలవంత పెట్టినా వినకుండా బయల్దేరి బస్సు స్టాండుకివచ్చింది.

"ఆదిత్యను సురక్షితమైన చోట వుంచే"నన్న తృప్తి ఆమెకు ఎంతో బలాన్ని చేకూర్చింది. తన క్లాస్‌మేట్స్ రాజేశ్వరి, రాంగోపాల్ కర్నూలులో కాన్వెంటు నడుపుతున్నారని విని వారి స్కూల్లో తనకి జాబ్ దొరక్కపోదని వెళ్లింది. వారు శారదను సాదరంగా రిసీవ్ చేసుకొని ఆమెకు నెలకు వేయి రూపాయల జీతం ఇచ్చేటట్లు టీచరుగా అపాయింట్ చేసుకున్నారు. వారి స్కూల్లో మూడు ఏళ్లు పనిచేసింది. కొడుకును చూడాలనే కోరికను ఎంతో బలవంతాన అపుకుంది. వారికి తన ఎడ్రస్సు కూడ తెలియపర్చలేదు. ఈ లోపల రాజేంద్ర పైచదువులకు అమెరికా వెళ్తూ శ్యామలను, ఆదిత్యను కూడ అతనితో అమెరికా తీసుకెళ్ళేడని వింది.

రాంవరంలో క్రొత్తగా పెట్టిన హైస్కూల్లో బి.ఇ.డీ టీచర్స్ కావాలనే ప్రకటన చూసి అప్లై చేసింది. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి ఉద్యోగం వచ్చింది. మళ్లీ వాళ్ళ అమ్మమ్మ ఆదిలక్ష్మిగారింట్లో ఓ పోర్షన్‌లో వుంటోంది. ఆదిలక్ష్మిగారు సహృదయులు. శారదను ఎంతో ఆప్యాయతతో చూసుకుంటూ ఆమెవద్దనుండీ ఇంటి అద్దె పుచ్చుకొనక పాలు, పెరుగు, కూరగాయలు, సన్నబియ్యం ఫ్రీగా ఇస్తున్నారు. శారద తన భర్తగురించి, ఆదిత్య గురించి ఎవరికీ చెప్పలేదు.

"ఇప్పుడు ఆదిత్య ఎక్కడ ఉన్నాడో? ఏం చేస్తున్నాడో? శ్యామల ఎలా వుందో" అన్న ఆలోచనలు మళ్లీ ఇన్నేళ్లకి శారద మనసును కలచివేసేయి.

రవీంద్ర ఫోను చేసి తాను సేఫ్‌గా చేరినట్లు, ఇల్లు సదుపాయంగా ఉన్నదని ఇక్కడివారు ఎంతో ఆప్యాయంగా ఉన్నారని చెప్పేడు వాళ్ల అంకులికి.

మర్నాడుదయం ఎనిమిది గంటలకు హాస్పిటల్‌కి వెళ్లి స్టాక్ బుక్ చెక్‌చేసేడు. అంతకు రెండు రోజుల క్రితం వచ్చిన మందులు, పరికరాలు సుమారు పదివేల రూపాయల విలువగల సామాన్లు లేవు సూర్యారావును నిలదీస్తే వాటిని తను అమ్మివేసి ఆ సొమ్ము వాడుకున్నట్లు స్టేటుమెంటిచ్చేడు. రవీంద్ర విషయం డి.యమ్.ఓ గారికి వెంటనే తెలియజేసేడు. సూర్యారావు సస్పెండయ్యేడు.

రవీంద్రకు భోజనం టిఫిన్ రెండు పూటలా శారదగారు పంపుతున్నారు. చలమయ్యగారు పాలు, పెరుగు, పండ్లు పంపుతున్నారు. శివయ్య రవీంద్ర పనులన్నీ చేస్తున్నాడు. మల్లి తరచువచ్చి చూసి వెళ్తోంది.

ఒక రోజు సాయంత్రం రవీంద్ర హాస్పటల్ నుంచి వచ్చి స్నానం చేసి రిలాక్స్ అవుతుండగా మల్లి, శారద, మరొక ముసలావిడ వచ్చేరు. రవీంద్రవారిని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టేడు.

"ఈవిడ మల్లి అమ్మమ్మ ఆదిలక్ష్మిగారు. ఈ సాయంత్రమే ఊర్నించి వచ్చేరు" అని పరిచయం చేసేరు శారదగారు.

ఆదిలక్ష్మిగారికి సుమారు 65 సం॥ వయస్సుంటుంది. మనిషి ఎంతో దృఢంగా వున్నారు.

"శారదమ్మ తల్లి మీ ఇసయం సెప్పేరు. ఊర్లజనమంతా తమరు నిజంగా దేవుడే అంతన్నారు. ఓపాలి సూసిపోవాలని ఒచ్చినాను. తమకుయీడ ఏ సోటూసేక అన్నీ కుదిర్నాయా! ఏటిగావాలన్నా సెప్పండి. సేపిత్తాను' అన్నారు.

అంతలో మూలాటోర్కిపట్నంల పెరిగినోల్ల కేంగావోల తెల్దండి తమరే సెప్పాల" అంటూ వచ్చేడు చలమయ్య. పాలచెంబు మల్లికిచ్చేడు.

"డాట్టరు బాబూ! ఆదిలచ్చిగారు కోటీస్పరాలు. ఈ ఆసుపత్రి బంగలా, హైస్కూలు గట్టించిన గొప్పమనసుగల మడిసి" అన్నాడు చలమయ్య.

"తొల్త కాఫీవుచ్చుకోండి సల్లారిపోతంది" అని మల్లి వారందరికీ నెస్‌కేఫ్ కలిపి ఇచ్చింది.

చలమయ్య చెప్పిన విషయం విని ఎంతో ఆశ్చర్యపోయేడు రవీంద్ర. "'అంతసంపన్నురాలు తనను చూడవచ్చేరా!" ఏమాత్రం గర్వంలేకుండా ఎంతో అభిమానంతో తన కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నందుకు ఆవిడకు తన కృతజ్ఞతలు వెల్లడించేడు.

"కోట్లకు హాంసురాలైన మల్లి ఏమాత్రం అతిశయం లేకుండా తన సామాన్లు మోసుకొని

వచ్చిందని" ఎంతో నొచ్చుకున్నాడు.

"యింత గొప్ప తనవేటుంది బాబూ! రైతుబిడ్డ టయాంల నడుంగట్టి పన్ల దిగాల!" అన్నారు ఆదిలక్ష్మిగారు.

"ఇంట్లో టీచరమ్మగారున్నారు కదా! మరి మీ మనుమరాలు మల్లికి నాలుగు అక్షరం ముక్కలు నేర్పించవల్సింది" అన్నాడు రవీంద్ర.

"దానికి చదువురాదని, చదువుకోలేదని నీకు చెప్పిందాబాబూ! మల్లి బి.ఎ. ఫస్ట్‌క్లాసులో పాసైంది" అన్నారు శారదగారు నవ్వుతూ.

"మరి ఆమె మాట్లాడే భాష...."

"పొట్టి రాలుగాయి" అన్నారు ఆదిలక్ష్మిగారు.

"బాబూ సిన్న ఉపకారం సెయ్యాల, ఆ సూర్రావును సెమించివొగ్గేసేవా? నాను పూర్లదిగ్గానే ఆడి పెల్లాం నాకాల్లట్టుగుంది" అన్నారు ఆదిలక్ష్మిగారు.

"అదెలా సాధ్యం గవర్నమెంటు సొమ్ము పదివేల విలువచేసేమందులు అవి అమ్ముకొని....'

"అదే డాట్టరు బాబూ ఆ సొమ్మేటో ఎంతో సెపితే అయిడదాన్ని సర్దుబాటు సేస్తారు" అన్నాడు చలమయ్య

ఆవిడ ఉదారబుద్ధికి మనస్సులోనే జోహార్లు అర్పించేడు రవీంద్ర

"బాబూ ఆవిడ పెద్దమనస్సుతో సహాయం చెయ్యాలనుకున్నారు. నువ్వు ఇంకేమీ సంకోచించక విషయం మీ డి.ఎమ్.ఓగారికి చెప్పి ఒప్పించు" అన్నారు శారదగారు.

రవీంద్ర ఫోను చేసి డి.ఎమ్.ఓ గారికి చెప్పేడు ఆయన మర్నాడు ఉదయం వస్తానన్నారు. ఈ సంగతి ఆదిలక్ష్మిగారికి చెప్పేడు. ఆవిడ ఎంతో సంతోషించి వెళ్లిపోయేరు:

ఆరోజు రాత్రి ప్రక్క గ్రామం లక్ష్మీపురంలో ఓ అర్జంటు కేసువుంటే చూడ్డానికి వెళ్లేడు రవీంద్ర. రాత్రిపూట పొరుగూర్లకి వెళ్లవలసి వస్తే శివయ్యను తోడుతీసుకుని వెళ్లడం రవీంద్రకు అలవాటు. ఆ రోజు శివయ్య రవీంద్ర లక్ష్మీపురం నుండి తిరిగి వస్తూంటే దారిలో సూర్యారావు అతని బావమరిది మంగపతి వారిపై దాడి జరిపి కొట్టేరు. శివయ్యకు తలపై దెబ్బతగిలి రక్తం వస్తోంది. రవీంద్రకు నుదిటిమీద దెబ్బ తగిలి చర్మం చిట్లింది.

" నా సంగతి నీకింకా తెలియదు ఇప్పుడు కొట్టిన దెబ్బలు శాంపిల్ మాత్రమే. నువ్వు వెంటనే ఊరు వదలి వెళ్ళిపో. లేకుంటే నీ అంతు చూస్తాను" అని సూర్యారావు రవీంద్రను బెదిరించి వెళ్ళిపోయేడు.

రవీంద్ర వెంటనే తేరుకొని శివయ్యతలకు కట్టుకట్టి వాడిని నెమ్మదిగా యింటికి తీసుకొని వచ్చి నిద్రమాత్రవేసి పడుక్కోబెట్టాడు. తనగాయాలను శుభ్రపరచుకొని కట్టుకట్టుకొని పడుక్కున్నాడు.

శివయ్య ఉదయాన్నే లేచి రాత్రి జరిగిన సంఘటన ఊర్లో జనాలకి చెప్పేడు. ప్రజలందరూ రవీంద్ర ఇంటిముందు చేరేరు.

రవీంద్ర కళ్లు తెరిచేసరికి ఆదిలక్ష్మిగారు, శారదగారు, మల్లీ అతనివేపు ఆత్రంగా చూస్తూ కనిపించేరు.

"ఎలా వుంది బాబూ, యీ ఘోరం ఎలా జరిగింది? లేవకు కాస్సేపు పడుక్కో" అన్నారు శారదగారు.

శివయ్య చెప్పిందంతా విన్న చలమయ్యగారు ఉగ్రరూపందాల్చి "ఎల్లండి ఆ సూర్రావుగాడిని ఆడిబావమర్దిగాడ్ని మక్కెవిరగదన్ని యీడుసుకురండి" అని ఆర్డరు వేసేరు. జనాలు వాళ్లని వెతకడానికి వెళ్లేరు.

ఆదిలక్ష్మిగారు ఈ సంఘటనకు షాకయ్యేరు. ఏమీ మాట్లాడక కాస్సేపు కూర్చుని వెళ్లిపోయేరు. శారదగారు టిఫెన్ చేసి తెస్తానని వెళ్ళేరు.

మరో గంటలో రవీంద్ర అంకుల్ డి.ఎమ్.ఓ గారు అతని భార్య కారులో వచ్చేరు. ఊర్లో జనం పోలీసులు అక్కడ ఎందుకున్నారోనని ఆశ్చర్యపడి విషయమేమిటని అడిగేరు.చలమయ్యగారు జరిగింది చెప్పేరు. మల్లి ఎదురువచ్చి వారిని లోనికి తీసుకొని వెళ్ళింది. వారు వచ్చినట్లు ఇంటికి కబురుపంపించింది.

"నేను మీకు మొదటినుంచీ చెప్తున్నాను. విలేజీల్లో కులమత పట్టింపులూ, వర్గపోరాటాలూ, కక్షలు, ద్వేషాలు ఎక్కువగా వుంటాయి. అందుచేత రవిని పంపకండీ అని. మీరు నా మాట వింటేనా? చూడండి కాస్తలో తప్పిందిలేకుంటే కన్నుపోవల్సింది" అన్నారు డి.ఎమ్.ఓ గారి భార్య జీరపోయినగొంతుకుతో.

ఆదిలక్ష్మిగారు వస్తూ ఆవిడ మాటలు విన్నారు జనులు సూర్యారావుని, మంగపతిని కాళ్లూ చేతులు బంధించి ఈడ్చుకవచ్చి చలమయ్యగారి ముందు పడవేసి కట్లు విప్పేరు. ప్రజలు వారికి బాగా దేహసుద్ధి చేసినట్లుంది వారి వాలకం.

"దేవుడు లాటి డాట్టరు బాబు మీద సెయ్యిసేసుకున్నావు. ముదనష్టపు సచ్చినోడ: నీలాటోడి పెల్లాన్నని సెప్పుకునేకన్న సావడం నయం సీ! ఎదవజలమ" అంటూ చీదరించుకుంది సూర్యారావు భార్య.

"వీళ్లను తీసుకెళ్లి లాకప్‌లో పడేసి కేసు బుక్ చెయ్యండి" అని కానిస్టేబుల్స్‌కి ఆర్డరిచ్చేరు ఎస్.ఐగారు.

"ఆగండి! వాళ్లని ఏనేరం కింద బుక్‌చేసి తీసుకెళ్తున్నారు" అన్నాడు రవీంద్ర

"అదేటి బాబూ! అల్లు శివయ్య తలపగలగొట్టేరు. తవర్ని కొట్టేరు" అన్నాడు చలమయ్య.

"నో! అబద్ధం వాళ్లు మమ్మల్ని కొట్టలేదు. కొట్టేరని నేను ఎవరికీ రిపోర్టు ఇవ్వలేదు. రాత్రి చీకట్లో వస్తూ దార్లో పడ్డాం అంతే" అన్నాడు రవీంద్ర.

అక్కడ చేరిన జనమంతా నిర్ఘాంతపోయేరు.

సూర్యారావు మంగపతి వచ్చి రవీంద్ర కాళ్లమీదపడ్డారు క్షమించమని వేడుకున్నారు.

ఆదిలక్ష్మిగారు ఎంతో ఆరాధనతో, ఆత్మీయతతో రవీంద్ర ఓర్పరితనాన్ని అభినందించేరు.

అప్పుడే అక్కడకు వచ్చిన శారదగారు డి.ఎమ్.ఓగారి భార్యను చూసి ఆనందంతో శ్యామలా! అని ఆమెను కౌగిలించుకున్నారు. అన్నయ్యా! అన్నారు డి.ఎమ్.ఓ గారిని చూసి సంతోషంపట్టలేక.

రవీంద్రకు అంతా అయోమయంగా వుంది.

"మా ఆంటీని, అంకుల్ని మీకు తెలుసా?!" అన్నాడు శారదగారితో

"తెలియడమేమిట్రా! ఆవిడ ఎవరనుకుంటున్నావు నీకన్న తల్లి- అని" శారదా ఇదుగో నీ ఆదిత్య" అన్నారు శ్యామలగారు నవ్వుతూరవీంద్రను చూపుతూ.

రాజేంద్ర వెంటనే ఆదిలక్ష్మిగారి వద్దకు వచ్చి "అమ్మా! మీకో మంచి శుభవార్త!" అన్నాడు.

"తవరు సెప్పబోయేదేటో నాకెరికె! ఈ శారదమ్మ ఎవ్వరోగాదు ని కొడలు మాధవయ్య పెల్లాం, డాట్టరు బాబు ని మనవొడు మాధవయ్య కొడుకు అనీ! ఆయిసయం నాకేనాడోదెల్సు" అన్నారు ఆదిలక్ష్మిగారు కోడలిని, మనుమడిని దగ్గరకు తీసుకొని.

"యీ సిక్కులన్నిటికీ గారనం అమ్మినాయుడు గొడండి. అనాదగాడిని సేరదీసి యింట్ల ఎట్టుకున్నావండి. ఆడికి పెల్లిసేసి నాలుగు మడిసెక్కలిచ్చి బతకమన్నావండీ, ఆడు నన్ను అప్పా! అనీవోడండి. ఆడి బొట్టిని దీసుగొచ్చి నీకొడలు మాధవయ్య పెల్లాం అని యిగటాలాడీవోదండి. వూర్ల పెసారంసేసేడండి. ఆడికి మా అత్తిమీద కన్ను పడిందండి. కన్నేసినాడని కానుకోనేదండి. మాధవయ్య డాట్టరు సదివి ఉజ్జోగం సేస్త తవరి పెల్లిల శారదమ్మను సూసి మనుసుపడి ఈ యిసయం సెప్పి రీస్టరీ పెల్లి సేసుకుంతానన్నాడండి. సేసుకున్నాడండి. అమ్మినాయుడికి ఈ సంగతి దెల్సి అడింటికి కయ్యానికెల్లి బెదరగొట్టినాడండి.

తల్లీబిడ్డను ఇడదీయసూసినాడండి. మావోడి ఉత్తరాలు గూడ నానుసూడకుండ సేసేడండి. గెహసారం సాలక గోరం అయిపోనాదండి. పాపం పున్నెం బగవంతుడికెరిక. ఈడే సేసేడని వూర్ల జనం ఎంటబడిత వూరొగ్గి ఎల్లిపోనాడండి. మరిపికర్నేడండి-

నాను కోడలు మనువడిని దోలుకురమ్మని సెలవయ్యను అంపినానండి. మరి యీయమ్మ బెగలిపోయి బొట్టిడిని తవకాడొగ్గేసినాదండి తవరు ఆడిపేరు మారిసికాసేరండి. తవకాడ బెరిగిత ఆడికి నాలుగుచ్చరంముక్కలబ్బుతాయని నాను పల్లకుండిబోనానండి. ఊర్ల అయిస్కూలు గట్టింపించి శారదమ్మను దెప్పించానండి. మనువొడి గోసం ఆసుపత్తిరి గట్టింపించినానండి" అన్నారు ఆదిలక్ష్మిగారు.

"శారదా నీ ఆశాకిరణాన్ని నీ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్ది మళ్లీ నీకు అప్పగిస్తున్నానే" అంది శ్యామల.

"అప్పగించాల్సింది నాకు కాదే ఆవిడకు" అంది శారద తన అత్తగారిని చూపించి.

"ఏటవెమ్మో! ఇద్దరత్తమ్మలు సేరి మా బావను అప్పగింతలెడతన్నారు. బావను అప్పగింత ఎట్టాల్సింది ఆపెద్దావిడగోరికి గాదు నాకు" అంది మల్లి.

ఆమె మాటలకు అంతా నవ్వుకున్నారు.

(ఫేకర్ 1960, ఉగాది సంచిక)✪